# మోహం

## వీరభద్రరావ్ పమ్మి

డాక్టర్ రమేష్ ఆరోజు చాలా చిరాకుగా వున్నాడు. అతనికి సాధారణంగా కోపం, చిరాకు కలగవు, కాని ఆవేళ మాత్రం అతనుధుమధుమలాడిపోతున్నాడు

ఇద్దరు లాబ్ అసిస్టెంట్లను తిట్టాడు. లేటుగా వచ్చిన ఓ అటెండర్ కి మెమో ఇచ్చాడు. పరమ శాంతమూర్తిలా ఎప్పుడూ నవ్వుతూ ఉండే బాస్ ఎందుకారోజు రియాక్షనిచ్చిన పెన్సిలిన్ లా ప్రవర్తిస్తున్నాడో ఎవరికీ అర్థం కాలేదు.

లాబ్ క్లీన్ గాలేదని, ఫ్రిజ్ లో వాటర్ లేదని లాబ్ అసిస్టెంట్లను తిట్టాడు. బాస్ దగ్గర గారాలుపోతూ ప్రవర్తించే మిస్ మేరీకి వణుకు పుట్టుకొచ్చింది. ఆమెకతని టేబిల్ మీద పడేసుకునేంత చనువుంది. తప్పుచేసినా నవ్వుతూ చెప్పే బాస్ "ఇఫ్ యు రిపిట్ ది సేమ్ మిస్టేక్—ఐవిల్ గెట్ యు డిస్మిస్డ్" అన్నాడామెను.

అలా మరొకళ్ళనంటే 'ఈ అందగాడికి కోపంకూడా వస్తుందా' అనుకుని నవ్వుకునేది మేరీ. కాని ఆ అన్నది తననే అయినప్పుడు అవమాన పడిందామె. బాస్ కి ఆమె క్లోజని అందరూ చెప్పుకుంటారు. తన గొప్పతనం లేకుండా చేసినందుకామె ఎక్కువ బాధపడింది. గదిలోకి పిల్చి ఛెళ్ళున లెంపకాయ కొట్టినా ఆమె బాధ పడేదికాదు. 'ఇటీజ్ లైక్ సింపుల్ కిస్'—అని సరిపెట్టుకునేది. అలాంటిది.. ?

రమేష్ ఆరోజలా ఉండటానిక్కారణం రేసుల్లో డబ్బుపోవడంవల్లకాదు. అదేమిటో తెలియదతనికి. ఎరిండి అతన్నితిట్టినందువల్ల కాదు. ఆయన రమేష్ ని పెంపుడు కొడుకులా చూసుకుంటాడు. ఎలక్షన్లో తన కిష్టమైనపార్టీ నెగ్గనందువల్లకాదు. అతనసలు ఎలక్షన్లో ఓటు కూడావెయ్యడు. పోనీ గృహసీమలోచిన్న చిన్న తగవులా? అతనింకా బ్రహ్మచారేనండి!—

అతని స్టాఫ్ మొత్తం—విడివిడిగాను, ఉమ్మడిగాను ఆలోచించి పరిశోధించినా బాస్ కోపానిక్కారణం తెలియదు.

"దరమరాజులాటి ఈ బాబు కూడా చిరబురలాడిపోతే మనమీ కంపెనీలోపన్జేసి నట్టే" ఏభైఏళ్ళుపై ఒడిన రాజరత్నం కామెంట్.

రమేష్ కోపానికి చిరాకుకి కారణం అతని తండ్రి నుంచి వచ్చిన ఉత్తరం....

అతని మనసులో మాధురికిరణ్ మెదిలింది.

"ఎంత చక్కటి పిల్ల. పేరు కూడా సింప్లీ నైస్....ఇంట్లో పిల్చేపేరు డాలీ! ఆమె నిజంగానే కుందనపు బొమ్మలా వుంటుంది"

రమేష్ పెదాలమీద చిర్నవ్వు రెండే నిముషాలు నిలబడి మంచులా కరిగి పోయింది. ముఖంమీద నిస్పృహ........

"నా బేడ్ లక్....నాన్న ఆ అమ్మాయిని చేసుకోవద్దన్నాడు. ఐఘడ్ బ్లైమెస్టార్స్." అనుకున్నాడు.

ం ం ం ం

తండ్రితనని నిరాశ పరిచినా రమేష్‌కి తండ్రిమీద కోపం రాలేదు. అతనికెప్పుడూ తండ్రిమీద కోపం రాదు.

రమేష్ తండ్రి సుబ్బారావుగారు వాళ్ళ స్వంత ఊళ్ళో ఎలిమెంటరీస్కూల్ టీచరు. అతనికి గొప్ప ఆస్తుల్లేవు, డబ్బులేదు— కంపెనీల్లేవు, ఎందులోనూ షేర్లులేవు. ఆయనకి తండ్రి మిగిల్చిన పాతఇల్లు (దాని కప్పులోంచి ఈశాన్యమూల కుండగాను, పడమటివైపు భారీగాను వర్షం కురుస్తుంది.) ఎకరన్నర భూమి వున్నాయి. ఆ కొద్ది పాటి ఆస్తిలో ఆ చిన్నఉద్యోగంలో ఆయన అప్పులే చేసాడో పస్తులే వున్నాడో తెలియదు. రమేష్‌ని చదివించాడు. చదివించడంలో సెకెండరీగ్రేడ్ ట్రైనింగూ ఆర్నెల్లు సర్టిఫికెట్ కోర్సూకాదు. పి.హెచ్‌డి వరకు చెప్పించాడు.

సుబ్బారావుగారు కొడుకు తెలివితేటల్ని చిన్నప్పుడే గ్రహించారు, అతని చదువుకి కావల్సిన ఏర్పాట్లుచేస్తే అతను వృద్ధిలోకి వస్తాడని నమ్మాడు. తనలాకాక మంచి పొజిషన్‌లో బాగా బతుకుతాడని ఆశ పడ్డాడు— కొడుకు మంచి భవిష్యత్తుకోసం కలలు కన్నాడు. కలలు కంటూ కూర్చోక వాటిన్నిజాలు చెయ్యడానికి అహోరాత్రులు కష్టపడ్డాడు. కొడుక్కి ఏలోటూ రాకుండాచూసుకున్నాడు.

తన పి.హెచ్‌డి వెనకాల తండ్రి అనుభవించిన ఎంత యాతన. ఎంత వేదన, ఎంత తపన, ఎన్ని పస్తులు ఎన్ని నిద్రలేని భయంకర రాత్రులువున్నాయో రమేష్‌కి తెలుసు.

రమేష్ కి చిన్నతనంలోనే తండ్రిమీద భక్తితో కూడిన గొప్ప అభిప్రాయం ఏర్పడిపోయింది— కాబట్టే మంచి చదువు చదువుకుని, మంచి ఉద్యోగం చేస్తూ —తన నాపొజిషన్‌లో చూసిన తండ్రి కళ్ళల్లో కలిగే మెరుపునుచూసి ఆనందపడాలని నిర్ణయించుకున్నాడు.

అతను పి.హెచ్‌డి అయిన్నాడు సుబ్బారావ్‌గారి ఆనందానికి పట్టపగ్గలేవు. వాడి యోగం బాగుండి. వాడి జాతకం అలాంటిది. వాడింతటివాడవుతాడని వాడి చిన్నతనంలోనే చినపూర్ణయ్య సిద్ధాన్తిగారు చెప్పాడు." అన్నారాయన భార్యతో.

రమేష్‌కి త్వరలోనే హైదరాబాద్‌లో మందులు తయారుచేసే పెద్దకంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. అతని ఇంటి అద్దె కంపెనీయే భరిస్తుంది. అతను కారు కొనుక్కోడానికి కంపెనీ అప్పు ఇచ్చింది. త్వరలోనే అతను స్పెషల్ ట్రైనింగ్ కోసం అమెరికా వెడతాడు.

అతను అమెరికా వెళ్ళేలోగా పెళ్ళి చేసెయ్యాలని తల్లిదండ్రుల సంకల్పం. ఆ ప్రస్తావన వచ్చినప్పుడు తండ్రి రమేష్‌తో—

"పిల్ల విషయం నీ యిష్టం. నీ ఇష్టమొచ్చిన అమ్మాయిని చేసుకో కట్నకానుకలమీద నాకు ఆశలేదు. నీ మీద వ్యాపారం చెయ్యాలని నిన్ను చదివించలేదు. నేను పడ్డకష్టం ఎన్ని లక్షలిచ్చినా తీరనిది. కష్టపడినందుకు బాధపడటంలేదు అది నైతిక బాధ్యత.

నీ చిన్నతనంలోనే నీ జాతకచక్రం వేసిచూశాను. నీకు రాజయోగం వుంది. నీ జాతకంలో ఉన్నట్టు గ్రహాల పొజిషన్ ఎవరికోగాని వుండదు—వెంటనే చినపూర్ణయ్య సిద్ధాన్తిగార్కి నీ జాతక చక్రం చూపించాను ఆయన నా రీడింగ్స్‌లో ఏకీభవించారు. "వీడుమంచి హోదాకి వెడతాడు. చదువు విషయంలో కాస్తశ్రద్ధచెయ్యి" అన్నారు. ఆనాడే నిన్ను చదివించాలని నిర్ణయించుకున్నాను. నువ్వుకూడా నాలా ఏదుగు బొదుగులేని [illegible]



సుఖసంతోషాలు నీ అందుబాట్లో ఉండే ఏర్పాటుచెయ్యాలను కున్నాను.

నువ్వు నామాట పోకుండా శ్రద్ధగా చదువుకున్నావ్. మంచి పొజిషన్లోకివచ్చావ్. సుఖపడతావ్....కానీ మగాడు సుఖపడటానికి ఒక్కడబ్బే ముఖ్యంకాదు. అంతకన్నా మెఖ్యమైనది మంచిభార్య. మగాడి జీవితం నరకమైనా స్వర్గమైనా అది ఆడ

దానిచేతిలో వుంటుంది. కాబోయే భార్యలు మంచి అన్నది ఎలా నిర్ణయిస్తావంటే చెప్పడం కష్టం. మన వివాహ వ్యవస్థలో పెళ్ళికిముందు ఒకర్నొకరు తెలుసుకునే అవకాశంలేదు. చేసుకున్నాక ఒకర్నొకరు అర్థం చేసుకుని బతగ్గలగాలి—అందుకుగుణం ముఖ్యం. నీ విషయంలో నాకా అనుమానం లేదు. నా కొడుకువని చెప్పుకోడంకాదు గాని నువు గొప్ప గుణవంతుడివి. కాబట్టి నీ భార్యను ఎన్నుకునేముందు ఆమె గుణం ఎలాంటిదో తెలుసుకోవాలి—అది చెప్పగలిగేది మనుషులుకాదు. . . "

చెప్పడం ఆపిన తండ్రి ముఖంలోకి ఆత్రంగా చూశాడు రమేష్.

"జాతకం"

ఈసారి తండ్రి ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు "ఫలానా అమ్మాయి గుణవంతురాలో కాదో జాతంకలో ఎలాతెలుస్తుంది." సైన్సు చదువుకున్న రమేష్ అనుమానం వెలిబుచ్చాడు.

"తెలుస్తుంది. గ్రహస్థితిని బట్టి ఏ అమ్మాయి గుణం ఎలాంటిదో చెప్పొచ్చు—కాబట్టి పిల్లను ఎన్నుకోడం విషయం నీ ఇష్టం. ఆమె జాతకంమాత్రం నాకు నచ్చాలి... "

రమేష్‌కి ఏం మాట్లాడాలో తెలియలేదు. సైన్సు చదువుకున్న అతనికి తండ్రి చెప్పినది నమ్మబుద్ధికాలేదు, కాని సుబ్బారావు గారి అభిప్రాయాలు ఎంత నిర్దుష్టమైనవో అతనికి తెలుసు. అలాగని తండ్రి అంటే భయంకాదు. గౌరవం. తనకోసం కష్టపడ్డాడు. బాధలు అనుభవించాడు, ఆయన మనసు కష్టపెట్టడం మంచిదికాదు. పిల్లని ఎన్నుకోడంలో స్వేచ్ఛ తనదేకదా! —ఆయనతో ఏకీభవిస్తే పోతుంది అనుకున్నాడు.


"అలాగే లేనాన్నా—నీ ఇష్టం" అన్నాడు రమేష్. "నా కొడుకు అందర్లాంటివాడుకాడు. వజ్రపు ముక్క" అనుకున్నారు సుబ్బారావుగారు.

o o o o

మూర్తిగారు హైద్రాబాద్‌లో వ్యాపారం చేస్తారు. ఏం వ్యాపారం అంటే చెప్పటం కష్టం. ఆయన ఏ వ్యాపారమైనా చెయ్యగలడు. దానిక్కావల్సిన దన్ను, డబ్బు ఆయన దగ్గర పుష్కలంగా వున్నాయి. లేకపోతే ఏడిల్‌లో నయినా నరే ఇరవై వేలు కనీసం మిగలాలి. అంతకన్నా చిన్నదైతే ఆయన హుందాతనం కోసం పైప్ తాగుతారు. కార్లు, షేర్లు ఆయనకు బాగానేవున్నాయి. ఏవీతోచకపోతే షికారుగా బొంబే వెళ్ళి స్టాక్ ఎక్స్చేంజిని స్టడీ చెయ్యడం ఆయనకలవాటు.

ఆయనకో కూతురుంది. రమేష్ ఆమెను చూడ్డానికి వెళ్ళాడు. ఆమెపేరు మాధురీ కిరణ్. వాట్ ఎ బ్యూటిఫుల్ నేమ్ ఫర్ బ్యూటి ఫుల్‌గాళ్' అనుకున్నాడు రమేష్ ఆమెను చూడగానే. ఆమె అందంగా వుంటుంది—తెల్లగావుంది. నున్నని శరీరం వెన్నరాసినట్టు నిగనిగలాడుతోంది. ఆమె జుట్టు షాంపూ కంపెనీవారి ఎడ్వర్టయిజ్‌మెంట్ బొమ్మలోలా పట్టుదారాల్తో చేసినట్టుంది. పొడుగుకితగ్గట్టు అవయవాలన్నీ అందంగా కూర్చినట్టుందామె, ఆమె చక్కని ఇంగ్లీషు మాట్లాడగలదు, యాసగానైనా తెలుగు కూడా మాట్లాడుతుంది. ఆమె హోం సైన్స్‌లో ఎం.ఎస్‌సి చేస్తోంది. రమేష్‌కి ఆమె నచ్చింది. అంతవరకు ఆడవాళ్ళమీద, అందంమీద అసలు ఆసక్తి చూపని రమేష్‌కి జీవితంమీద, వైవాహిక జీవితంమీద గొప్ప ఇంటరెస్ట్ పుట్టింది" కారులో స్టీరింగ్‌దగ్గర నేను పక్కన మధు అని తల్చుకున్నప్పుడు అతని మనసు స్పందించింది.

అతను సృష్టికర్తకి జోహార్లు చెప్పకుండా ఉండలేకపోయాడు. ఆమెలో అతనికి ఎక్కువ నచ్చిన విషయం. ఆమె కలివిడితనం—సోషల్ బిహేవియర్ ... మరీ పురాతన పద్ధతిలో ముఖం దించుకుని కూర్చో




కుండా ఆమె గలగల మాట్లాడింది. బాగా మూవ్ అయ్యింది. తన కష్టాలు, సరదాలు సెంటిమెంట్లు అతనికి చెప్పింది. అతన్ని అడిగి తెలుసుకుంది. ఆమెతో ఉన్నకాస్సేపు అతనికి ఉల్లాసంగా, హాయిగా, ఆనందంగా వెన్నెల్లో గోదావరి పడవ ప్రయాణంలా అనిపించింది.

తనకూతుర్ని పెళ్ళిచేసుకుంటే అతనిచేత కిరణ్ ఫార్మాసెటికల్స్ పెట్టిస్తానని మూర్తిగారు సూటిగా అనకపోయినా అలాంటి అర్థంవచ్చే మాటలు అన్నారు.

మాధురిని చేసుకోవాలని రమేష్ వెంటనే నిర్ణయించుకున్నాడు. వెంటనే అతనికి తండ్రి షరతు గుర్తుకొచ్చింది:

మూర్తిగారితో అతనా విషయం ఖచ్చితంగా చెప్పేడు. "ఈజాతకాల్లో నాకు నమ్మకంలేదు. కానీ నాన్న మాటను తీసెయ్యలేను, హిఈజ్ మై వీక్ నెస్" అన్నాడు

దానికి మూర్తిగారో నవ్వు నవ్వి "అవును పెద్దాయన్ని ఎందుకు చిన్నబుచ్చాలి. ఆయన నమ్మకం ఆయనిది" అన్నాడు. కూతురి పుట్టినతేదీ టైమూ కాయితం మీద రాసిచ్చారు.

అవి తండ్రికి పంపినప్పట్నుంచే తండ్రి ఉత్తరంకోసం ఎదురుచూడని క్షణంలేదు. ఆక్షణం—బద్దలై ముక్కచెక్కలుగా బాధాకరంగా భయంకరంగా రానేవచ్చింది.—

తండ్రి ఆమెను చేసుకోవద్దన్నాడని ఆయనమీద తనకే చిరాకు, కోపం, బాధ కలిగాయి. 'నా అదృష్టంఇలావుంది' అనుకున్నాడు.

"మా జాతకాలు కలవలేదట—నన్ను చేసుకుంటే మీ అమ్మాయికి మంచిది కాదట." అని మర్నాడు ఫోన్‌తో మూర్తిగారికి ముక్తసరిగా చెప్పేసాడు.

మొదట్లోకాస్త బాధపడ్డా, రమేష్ మెల్లగా మానసికంగా రాజీ పడ్డాడు, జాతకాలు కూడా నమ్మాలేమో? అనిపించిందతనికి. మాధురి వాళ్ళింటికెళ్ళిన నాల్గోరోజుసాయంత్రం ఆమె మళ్ళీ ఎగ్జిబిషన్లో

స్నేహితురాళ్ళతో కనిపించింది. ఆనాడామె పల్చటి మేక్సీవేసుకుంది." ఆమె వయసు ఆ మేక్సీలోంచి బైటపడేటట్టు వున్నాయి. ఆమె రమేష్‌తో మాట్లాడుతుండగా ఒకతను అటుగాపోతూ ఆగి ఆమె దగ్గరగావచ్చాడు "ఇతను నా ఫ్రెండ్ రఘు" అని అతన్ని రమేష్‌కి పరిచయం చేసింది.

ఆమెతో సంబంధం తప్పిపోవడం మంచిదేమోనని అతనికిప్పుడనిపిస్తోంది. అలాంటి ఫాస్ట్‌గాళ్‌ని చేసుకుంటే వచ్చే ఇబ్బందులు ఎక్కువే—పైగా అమ్మా నాన్న అసలు సహించలేరు. పెళ్ళిచూపులరోజు ఆమె ఏ మాత్రమూ బిడియపడలేదన్న విషయం అతనికి జ్ఞాపకంవచ్చింది—ఆమె వేషధారణ, మగాళ్ళతో చనువుగా మాట్లాడటం. . . . . అతనికి మిస్ మేరీగుర్తుకొచ్చింది. ఆమె చాలా ఒబ్లైజింగ్‌టైప్ అని ఆఫీసులో అందరూ అంటారు.

మాధురి జాతకం గురించి తన తండ్రి రాసిన విషయాలకి, ఆమె నడవడికి ఎక్కడో సంబంధం వున్నట్టుగా అనిపించింది.

'నాన్న ఎంత గొప్పవాడు' అనుకున్నాడతను మనసులో.

o o o o

తర్వాత చూసిన రెండు సంబంధాలు రమేష్‌కి నచ్చలేదు.

కొన్ని నెల్ల తర్వాత సుబ్బారావుగారి బంధువొకాయన సంబంధం గురించి చెప్పాడు. ఆయన ముందు పిల్ల జాతకం తప్పించి చూశారు, ఆమెది అద్భుతమైన జాతకంగా ఆయనకనిపించింది. ఆయన మరో ఇద్దరు సిద్ధాంతులను సంప్రదించారు. వాళ్ళిద్దరూ ఆయనతో ఏకీభవించారు. "పిల్ల జాతకం బాగుంది. గుణవంతురాలవుతుంది. అత్తవారికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెడుతుంది." అన్నారు.

తండ్రి కబురందుకుని రమేష్ ఆ సంబంధం చూడ్డానికి వెళ్ళాడు. ఆమెది అమలాపురం దగ్గర్లో పల్లెటూరు. ఆ అమ్మాయి పేరు అలివేణి. ఆమె ఏలూరులో వాళ్ళ మామయ్యగారింటిలో వుండి బి. యస్సీ చదువుకుంది. ఆమెమాట, నడత వేషధారణ సంప్రదాయకంగా వుంది. జడగంటలు, బుట్టలోలకులు, కాళ్ళకి పట్టెలు, ముక్కుపుడక....

ఆమె సుబ్బారావుగారికి, ఆయన భర్యకు నచ్చింది. ఆమె జాతకం గురించి తండ్రి చెప్పినప్పుడే రమేష్‌కి ఆమె మీద మంచి అభిప్రాయం ఏర్పడింది—తలొంచుకుని కూర్చున్న ఆమెను చూశాక ఆమెను చేసుకోడానికతనికి ఏ అభ్యంతరమూ కనబళ్ళేదు. "పల్లెటూళ్ళో పెరిగిన కారణంగా కాస్త పురాతంగావుంది. హైద్రాబాద్‌లో రెండు నెలలుంటే మారిపోతుంది. ఆమెను నాక్కావల్సినట్టు తీర్చిదిద్దుకోవచ్చు" అనుకున్నాడతను.

ఆమెను చేసుకోడానికి తన అంగీకారం తెలియజేసాడు.

o o o o

రమేష్ కోరిక ప్రకారం అతని స్నేహితులు రావడానికి వీలుగా పెళ్ళి రాజమండ్రిలో చేసారు.

ఆ రాత్రి మొదటి రాత్రి

"మీరు హైద్రాబాద్‌లో ఓ సంబంధం చూశారట, ఆ అమ్మాయి నాకన్నా చాలా బాగుంటుందట—ఆమె నెందుకు చేసుకోలేదు."

సిగ్గు తెరలమధ్య అలివేణి భర్తనడిగింది

"ఆమె జాతకం మంచిదికాదట—నాన్నా చెప్పాడు."

అంటే—ఆయుష్షు బాగాలేదా?" ఆమె మళ్ళీ అడిగింది. "కాదు ఆమె గుణవంతు

రాలు కాదట—చెడుతిరుగుళ్ళు తిరుగుతుందని ఆమె జాతకంలో ఉందట."

"అలాంటివి జాతకాల్లో తెలుస్తాయా?" ఆమె ఆశ్చర్యంగా అడిగింది. "తెలుస్తాయని నాన్న అన్నాడు, నాకు వాటి గురించి తెలియదు. నాన్నకు జాతకాల గురించి బాగాతెలుసు."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

రమేష్ ఆమెను దగ్గరగా తీసుకుని స్వర్గపు అంచులమీద నడుస్తున్నట్టు ఫీలవుతున్నాడు.

అలివేణి ఉక్కిరి బిక్కిరయి పోతోంది.

రమేష్‌ను భర్తగా పొందగలిగినందుక్కాదు. ఆ తెల్లటిదుప్పటి, అగరుబత్తులు, సెంట్ల మహిమవల్లకాదు. తనుపొందబోయే అనుభవం తాలూకు ఆరాటంవల్ల కాదు.

ప్రతి స్త్రీకి పురుషుడితో పొందిన మొదటి అనుభవం ఎంతో సులువైనది. ఆ అనుభవం తాలూకు అనుభూతి ఆమెలో జన్మంతా ఆనందాన్ని, తృప్తిని నింపుతుంది

అలివేణి రెండేళ్ళ క్రితం బి. ఎస్సీ ఫైనల్ చదువుతుండగా. బొటానికల్ టూర్ వెళ్ళినప్పుడు, విశాఖపట్నంలో—కంచర పాలెంలో ఓ మారుమూల ఇంట్లో చింకి చాప మిద తడిక అడ్డంకట్టిన గదిలో రాజుతో ఆమె పొందిన మొదటి అనుభవం గుర్తుకొచ్చి ఆమె ఉక్కిరి బిక్కిరయి పోతోంది.

రాజు ఆమె క్లాస్‌మేట్—అగది అతనికి తెల్సున్న ఓ పోర్టు వర్కర్‌ది. ■


ఆధునిక 17 జూవెల్స్ రిస్ట్ వాచ్
రు. 30 లకే పొందవచ్చును.



స్విస్ మోడల్, ఆల్ ప్రూఫ్, ఖచ్చితంగా వుండుటకొరకు ఆటోమెటిక్‌గా పరీక్షించబడిన 17 జూవెల్స్ విలువైన రిస్ట్ వాచి రు 180 లకే పొందగలరు. మా అమ్మకం ప్రమోషన్ పథకం క్రింద రు. 30 లకే పొందగలరు. మీ ఆర్డరును హిందీ లేదా ఇంగ్లీషులో వంపి నిజాన్ని తెలుసుకోండి. అడ్వాన్సు అవసరం లేదు.

FIJI ELECTRONICS (5-30)
Nirmalpuri, Delhi-110024.